క్లుప్తంగా

లారీ బోల్తా



వెనుక లారీ ఢీకొట్టడంతో బోల్తా పడిన ముందు లారీ

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాపురం గ్రామ సమీపంలో లారీ బోల్తా పడింది. శుక్రవారం రాయపూర్ నుంచి విశాఖకు బొగ్గుతో బయలు దేరిన మూడు లారీలు గొర్లెసీతారాంపురం గ్రామ సమీపంలో ముందున్న లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో ముందున్న లారీ బోల్తా పడింది. గ్రామస్తులు, స్థానికులు గమనించి డ్రైవర్, క్లీనర్‌లను బయటకు తెచ్చారు. దీంతో ఢీకొట్టిన లారీకి ముందు భాగం దెబ్బతినగా లారీ డ్రైవర్‌లు, క్లీనర్ స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డారు. ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

వంగర: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధి రాజులగుమ్మడ, కొప్పరవలస సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, వివిధ సమస్యలపై వచ్చిన వినతులు, వాటి పరిష్కారం తదితర అంశాలకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట కెల్ల రామారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ

రామభద్రపురం: ప్రజారోగ్య రక్షణే ధ్యేయంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని వైద్యాధికారులు జి.లక్ష్మి, దిలీప్‌కుమార్, వైద్య సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని, గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేపట్టాలన్నారు. గ్రామాలలో సిబ్బందితో దోమల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' రుచి లేకుంటే చర్యలు



సంకిలిలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వంటలు చేస్తున్న నిర్వాహకులు రుచిగా వండకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు హెచ్చరించారు. మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస పాఠశాలల్లో భోజనం అమలును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మెనూ ప్రకారంగా ప్రతి రోజు వంటలు చేయాలని అన్నారు. వంటలు చేసిన అనంతరం ఆహార పదార్థాలను పాఠశాల హెచ్‌ఎం పర్యవేక్షించి రుచి చూసిన తరువాతే పిల్లలకు వడ్డించాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం మరడాన రామినాయుడు ఉన్నారు.

వంగరలో ఏనుగుల హల్‌చల్



వంగరలో పంట పొలాలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు

వంగర: మండల కేంద్రం వంగరలో తొమ్మిది ఏనుగుల గుంపు శుక్రవారం హల్‌చల్ చేశాయి. వారం రోజుల పాటు మద్దువలస, సంగాం గ్రామాల సమీపంలో తిష్ట వేసి పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు వంగర పంట పొలాల్లోకి చేరుకున్నాయి. వంగరలో వరి ఎదమడులలో, వరి నారుమడులను ధ్వంసం చేసిన అనంతరం ఎం.సీతారాంపురం పంట పొలాలవైపు పయనమయ్యాయి. ప్రధాన రోడ్డును ఆనుకొని ఏనుగుల గుంపు ఉండడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మార్కెట్ సొగసు చూడతరమా..!



రాజాం పాత బస్టాండ్ ఆవరణలో దుర్గంధంతో మార్నింగ్ మార్కెట్ ఏరియా



శ్రీనివాస మార్కెట్‌లో దుర్వాసన వెదజల్లుతున్న ప్రాంతం

రాజాం పట్టణంలో పలు మార్కెట్ ప్రాంతాలు చినుకుపడితే చాటు చిత్తడిగా మారుతున్నాయి. పారిశుధ్య లోపంతో పాటు వ్యర్థాల దుర్వాసనతో కంపు కొడుతోంది. అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల్లో తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. శానిటేషన్ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయంగా మారింది.

– రాజాం

ఆసుపత్రి కిటకిట



బాడంగి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి రోగులు శుక్రవారం పెద్ద సంఖ్యలో రావడంతో కిటకిటలాడింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారు చికిత్స నిమిత్తం వస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే సుమారు మంది ఓపీ రోగులుగా నమోదు కాగా వైద్యులు చికిత్సలు అందించారు. కొందరు ఇన్‌పేషంట్లుగా ఆసుపత్రిలో చేరారు. ఇదిలా ఉంటే ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రంగా లేవని పలువురు పెదవి విరుస్తున్నారు.

– బాడంగి

ఎరువు సంగతేంటి బాబూ...

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ డా. తలే రాజేష్



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం : నియోజకవర్గంలో అన్నదాతకు సకాలంలో అందించాల్సిన యూరియా ఎరువులు ఇంత వరకూ పంపిణీ చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. రాజాంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడ విత్తనాలను ఈ ఏడాది ప్రభుత్వం సక్రమంగా అందించలేకపోయిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు మొక్కజొన్నతో పాటు వరి నారుమడులకు అవసరమైన యూరియా ఎరువులు అందుబాటులో ఉంచలేకపోయిందని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ముందస్తుగానే ఎరువులు అందుబాటులో ఉంచేదని, నియోజకవర్గ కేంద్రంలో ఎరువుల స్టాక్ పాయింట్ ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఎరువులు ఇవ్వకపోగా, నియోజకవర్గంలో రైతులకు సరిపడ ఎరువులు తీసుకొచ్చామని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటనలు ఇస్తున్నారని, రైతుకు అందించని ఈ ఎరువు ఎటు వెళ్లిందో, ఎవరి వద్ద ఉందో తెలపాలని పట్టుబట్టారు. నియోజకవర్గ రైతాంగానికి వచ్చిన కాస్తో, కూస్తో ఎరువు కూడా పక్కదారి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిన పాలకవర్గం, డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసే వస్తు సామగ్రినైనా అందించాలని కోరారు.

తాగునీటి వనరులు క్లోరినేషన్ చేయాలి



గార్రాజుచీపురుపల్లిలో వాటర్‌ట్యాంకు వద్ద ఆరా తీస్తున్న ఎంపీడీవో

రాజాం : మండలంలో తాగునీటి వనరులు క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బొద్దాం, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. తాగునీటి బోరుబావులు, వాటర్ ట్యాంకులు, వీధి కుళాయిలు పరిశీలించారు. నీటిని పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. ఆయా తాగునీటి వనరులు చుట్టు పక్కల బ్లీచింగ్ చల్లాలని, శానిటేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ సందర్భంగా సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్ధాంతర నిర్మాణాల్లో ఉన్న వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు

బొబ్బిలి: పట్టణంలో ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి తప్ప ఒక్క ప్రభుత్వ కళాశాలయినా లేనందున, గతంలో ప్రజల వినతుల మేరకు వెంటనే జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇంచార్జ్ మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కోమటిపల్లిలో మహాత్మా జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాల తప్ప మరే విధమైన కళాశాల విద్య చదువుకునేందుకు అవకాశం లేదన్నారు.

రోశయ్య జయంతి సందర్భంగా నివాళులు

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అనేక సంవత్సరాల పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రిగా సేవలందించిన కొణిజేటి రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లు వెంకటరమణ, నాయకులు మండపాక శ్రీనివాసరావు, కోటి చీమల రామకృష్ణ, శివాజీ, కోటేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

నిలువ నీడ లేని 108 వాహనం



మండల పరిషత్ కార్యాలయ రోడ్డుపై నిలిపి వేసిన 108 వాహనం

బాడంగి: ఎందరికో అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందిస్తూ ప్రాణదాతగా నిలిచిన 108 వాహనానికి నిలువ నీడ లేకుండా పోయింది. దీంతో మండల పరిషత్ కార్యాలయ రోడ్డుపై దీన్ని నిలిపివేశారు. వర్షంలో తడిసి తుప్పు పడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. 108 సిబ్బంది, వాహనానికి పాత ఇంజినీరింగ్ కార్యాలయంలో ఒక గది ఇచ్చినా వర్షాకాలం కావడంతో వాహనం లోపలికి వెళ్లడానికి బురదమయం కావడంతో దారి బాగా లేక ఆరు బయటే రోడ్డుపై నిలిపివేశారు. సిబ్బంది వర్షాకాలంలో అతి కష్టం మీద కేటాయించిన గదిలోకి రాకపోకలు సాగిస్తున్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్: నిరక్షరాస్యత, నిరుపేదలుగా ఉన్న కుటుంబాలను గుర్తించి వారిని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బేబినాయన సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకుని సమాజంలో ఆర్థిక, సమానత్వపు గుర్తింపునివ్వాలని సూచించారు. ఆర్థికంగా బలమైనవారు, స్వచ్ఛంద సేవా సంస్థలు, పారిశ్రామికవేత్తల సహకారంతో బంగారు కుటుంబాలను తయారు చేయవచ్చని అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. 2047 నాటికి నిరుపేదలు ఉండరాదన్నది ప్రభుత్వ విధానమని బంగారు కుటుంబాల విధివిధానాలను వివరిస్తు అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీడీవో పి.రవికుమార్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి



హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఎంఈవో

రేగిడి: బడి బయట ఉన్న డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా హెచ్‌ఎంలు బాధ్యత వహించాలని ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య హెచ్‌ఎంలకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు దూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతుండడం, పిల్లలను వేరే వ్యక్తులకు అప్పగించడంతో వారు సక్రమంగా పాఠశాలకు రాకుండా ఉంటున్నారని అన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పక్కాగా సర్వే చేసి బడి బయట ఉన్న ప్రతి విద్యార్థిని పాఠశాలలో చేర్పించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు.

మండల సర్వేయర్‌గా సతీష్

బాడంగి: మండల రెవెన్యూ సర్వేయర్‌గా డి.మహేష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన బొబ్బిలి మండలం నుంచి ఇక్కడకు రాగా.. ఇక్కడ సర్వేయర్‌గా పని చేసిన వెంకటరమణ బదిలీపై పార్వతీపుం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

కాలువల్లో పూడిక తీత



అంబకండి వద్ద మద్దువలస పిల్ల కాలువల్లో పూడికల తొలగింపు

రేగిడి: మండలంలో సాగునీటి కాలువల దుస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు సాగునీరు పంట పొలాలకు అందే పరిస్థితి కష్టతరంగా మారింది. దీంతో రైతులే స్వచ్ఛందంగా కొంత మొత్తాన్ని సేకరించి మద్దువలస పిల్ల కాలువ, సంకిలి సాయన్నచానల్, అవుటు బట్టిల్లో రైతులు జేసీబీలతో పూడికలను తీయించుకుంటున్నారు.

నిలిచిన ఆర్టీసీ సర్వీసుతో అవస్థలు

బాడంగి: పార్వతీపురం డిపో నుంచి బొబ్బిలి మీదుగా ముగడ కాలనీ, బాడంగి మీదుగా షికారుగంజి రాకపోకలు సాగించే పల్లె వెలుగు బస్సు రెండు నెలలుగా నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మే నెలలో ఆర్టీసీ సర్వీసు నిలిచిపోయినా.. పాఠశాలలు, కళాశాలలు లేకపోవడంతో పెద్ద ఇబ్బందులు లేకపోయాయి. ఇప్పుడు వీటిని తెరచి సుమారు నెల రోజులవుతున్నా పునః ప్రారంభించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తమ పిల్లలను పాఠశాలలకు ఎలా పంపాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



పర్యటిస్తున్న కమిషనర్ తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని రోడ్లపై చెత్త వేసే ప్రజలు, దుకాణ దారులకు జరిమానా వేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో సిబ్బందితో కలసి పర్యటించారు. రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, పర్యావరణ ఇంజినీరు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

రాజాం సిటీ: నిత్యం పాఠశాల సమయ పాలనకు, పనిపట్ల నిబద్ధతకు, విద్యార్థుల చదువు పట్ల అంకితభావం ఉన్న కాలెపు గోవిందరావుని ఉపాధ్యాయులంతా ఆదర్శంగా తీసుకుని పని చేయాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన గోవిందరావుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచికి మారుపేరుగా నిలిచి ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. అనంతరం గోవిందరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు, హెచ్‌ఎం పి.వెంకటరావు, స్టాఫ్ సెక్రటరీ బీవీ అచ్యుత్‌కుమార్, పీడీ బి.శ్రీనివాసరావు, ఎస్‌ఏ శ్రీనివాస్, ఎస్.హైదిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

రామభద్రపురం: విద్యార్థుల విద్యా సామర్థ్యాల మెరుగుకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని రొంపల్లివలస ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 గంటలకు బయోమెట్రిక్ వేయాలని తెలిపారు. అలాగే పాఠశాలల తరగతులు ప్రారంభ దశలో ఉన్నందున పిల్లల సంఖ్యతో పాటు వారి హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. భోజనం రుచికరంగా వండేలా వంట నిర్వాహకులకు సూచించాలన్నారు. లెసన్ ప్లాన్‌లు తయారు చేసి వాటి ప్రకారం విద్యా బోధన చేయాలన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలి



కుసుమూరు పాఠశాలలో మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎంఈవో

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని ఎంఈవో జె.త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని కుసుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు మరుగుదొడ్లు వినియోగించేలా వాటిని ప్రతీ రోజూ శుభ్రం చేయాలని స్కావెంజర్స్‌కి ఆదేశించారు. మరుగుదొడ్లను అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని స్కావెంజర్స్‌ని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేసి మెనూ సక్రమంగా అమలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

హామీ నెరవేర్చకుంటే మళ్లీ సమ్మె



తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నామని కమిషనర్‌కు తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: గత 59 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెను సీడీఎంఏ హామీతో తాత్కాలికంగా విరమించారు. ఇచ్చిన హామీని పది రోజుల్లో నెరవేర్చకుంటే మళ్లీ సమ్మె బాట పడతామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర యూనియన్ నాయకులతో సీడీఎంఏ (కమిషనర్ ఆఫ్ డైరెక్టరేట్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్) జరిపిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇస్తున్నామని అన్నారు. వేతనాల పెంపు, ఇతర అంశాలు మంత్రివర్గం ఆమోదంతో అమలు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం సమ్మెను తాత్కాలికంగా విరమించామని తెలిపారు. యథావిధిగా శనివారం నుంచి విధుల్లో చేరనున్నామని పేర్కొన్నారు. సీడీఎంఏ, రాష్ట్ర మంత్రి వర్గం ఇచ్చిన హామీని 10 రోజుల్లో పరిష్కరించకుంటే మళ్లీ నిరవధిక సమ్మెకు వెళ్తామని కమిషనర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు, మరియదాసు, గణపతి, భాస్కరరావు, మోహన్, కృష్ణ, రామకృష్ణ, ప్రసన్న, శారద, లక్ష్మి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



వీధి కాలువల్లో పూడికలు తీసి, ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

తెర్లాం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచితే ఎటువంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందవని మండలంలోని రంగప్పవలస గ్రామ సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. మండలంలోని రంగప్పవలస పంచాయతీ పరిధిలోని తమ్మయ్యవలస గ్రామంలో గత నాలుగు రోజులుగా పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ శనపతి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లో గల వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పూడికలను వేతనదారులతో తొలగించి, తొలగించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా గ్రామానికి దూరంగా వేయిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు చెత్తాచెదారాలను వీధి కాలువల్లో వేయవద్దని కోరారు. కాలువల్లో చెత్తాచెదారాలు ఉంటే వాడుకనీరు, వర్షపునీరు వెళ్లదని, నీరు నిల్వ ఉండడం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. గ్రామస్తులు వారి ఇళ్ల ముందున్న కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

రామభద్రపురం: గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతే ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో రత్నం అన్నారు. మండలంలోని ఎస్ సీతారాంపురం, రొంపల్లి గ్రామాలలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. మంచి నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. అలాగే గ్రామాల్లో పరిసరాలను పరిశీలించి పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ఘనంగా అల్లూరి జయంతి



బొబ్బిలి రూరల్: అలజంగిలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్, హెచ్‌ఎంలు



రాజాం సిటీ: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం తదితరులు

బొబ్బిలి రూరల్: స్వాతంత్య్ర సమరంలో పోరాట పటిమను రగిలించిన యోధుడు అల్లూరి సీతారామరాజని అలజంగి మాజీ సర్పంచ్ బెవర సూర్యనారాయణ కొనియాడారు. మండలంలోని అలజంగి గ్రామంలో శుక్రవారం స్వాతంత్య్ర సమరవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మోజేష్, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

దిబ్బగుడ్డివలసలో..

సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు దూపం వాసు దిబ్బగుడ్డివలస గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విప్లవ వీరుడు సీతారామరాజు పోరాట పటిమను, దేశ సేవలను కొనియాడారు.

ఘనంగా అల్లూరి జయంతి

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, పాఠశాల సెక్రటరీ మజ్జి మదన్‌మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.